క్లుప్తంగా

విద్యార్థులు లక్ష్య సాధనకు శ్రమించాలి

- జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ ప్రసాదరాజు



స్కిల్స్ అంశాలపై వివరిస్తున్న డైరెక్టర్ ప్రొఫెసర్ మురళీకృష్ణ

బాలాజీచెరువు: తాము ఏర్పరచుకున్న లక్ష్య సాధనకు విద్యార్థులు శ్రమించాలని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. విజ్ఞాన యాత్రలో భాగంగా బుధవారం కాకినాడ ఆశ్రమ్ పబ్లిక్ స్కూల్ ఇంటర్మీడియట్ విద్యార్థులు వర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరాజు కెరీర్ గైడెన్స్, నైతిక విలువలు, స్పోకెన్ ఇంగ్లిష్‌పై పట్టు సాధించడం వంటి విషయాలపై వివరించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మార్గదర్శకంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలని హితవు పలికారు. వర్సిటీలో ఉన్న జంగిల్ బుక్ ఓపెన్ క్లాస్‌లో స్కిల్స్ అంశాలపై ఆన్‌లైన్ లెర్నింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళీకృష్ణ వివరించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, ఐఎస్‌టీ డైరెక్టర్ మురళీకృష్ణ, ఆశ్రమ్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆగస్టీన్ పాల్గొన్నారు.

బాలల పెంపకం విలువలతో జరగాలి



సదస్సులో మాట్లాడుతున్న వెంకట్రావు

కాకినాడ రూరల్: విలువలతో బాలలను పెంచాలని జిల్లా బాలల సంక్షేమాధికారి సీహెచ్ వెంకట్రావు తల్లిదండ్రులను కోరారు. బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో సర్పవరం జంక్షన్‌లో బుధవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాలలకు సమున్నత వ్యక్తిత్వం, చక్కని జీవన శైలి, క్రమశిక్షణ అలవాటు చేయడంతో పాటు అనుబంధాలు, ప్రేమ, ఆప్యాయతలు, నైతిక విలువలను తెలియజేస్తే.. వారు బాధ్యతగా పెరుగుతారన్నారు. తద్వారా తల్లిదండ్రులు తమ పిల్లలను దేశానికి మంచి పౌరులను అందించిన వారవుతారన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు అడబాల రత్నప్రసాద్, రాఘవరావు, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

నరసింహావతారంలో సీతారామస్వామి



బోట్‌క్లబ్: ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా స్థానిక మెయిన్‌రోడ్డులో ఉన్న సీతారామస్వామి ఆలయంలో బుధవారం స్వామి వారు నరసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి ఆలయ ప్రధానార్చకుడు భావవరపు భాస్కరాచార్యులు ఉదయం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆశా వర్కర్ల ధర్నా

కాకినాడ సిటీ: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలంటూ కాకినాడ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశా వర్కర్లు బుధవారం ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. ధర్నా అనంతరం తహసీల్దార్ సీతాపతిరావుకు వినతిపత్రం అందజేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ: విద్యుత్ వార్షిక మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు డెయిరీ ఫారం పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో డీఈ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలో డెయిరీఫారం సెంటర్, దుమ్ములపేట, పళ్లంరాజునగర్, సాంబమూర్తినగర్, అయోధ్యనగర్, రాజీవ్ గృహకల్ప ప్లాట్లు, రెవెన్యూకాలనీ, సత్యానగర్, స్వర్ణాంధ్రకాలనీ, ఇందిరాకాలనీ, గణేష్‌కాలనీ, జ్యోతుల కాలనీల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందన్నారు.

డి–1 సెక్షన్ పరిధిలో..

కాకినాడ డి–1సెక్షన్ పరిధిలో శుక్రవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో డీఈ ఒక ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ భవన్ ఫీడర్ పరిధిలోని కచ్చేరిపేట, అంబేడ్కర్ భవన్, వెంకటేశ్వరకాలనీ, సుందరయ్యభవన్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కాకినాడ రూరల్: వాకలపూడి సెక్షన్ పరిధిలో వార్షిక మరమ్మతుల కోసం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ జి.ప్రసాద్ తెలిపారు. వాకలపూడి సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ నేమాం, 11కేవీ మైనర్‌పేట, 11కేవీ నిఖిల్, 11కేవీ ఇండస్ట్రియల్–1, 11కేవీ ఇండస్ట్రియల్–2, ఐటీసీఎల్ ఫీడర్ల పరిధిలో నేమాం, సూర్యారావుపేట, వాకలపూడి, పెనుమర్తి, తమ్మవరం, పాముగుంట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వివరించారు.

రాష్ట్ర స్థాయికి గురజనాపల్లి ప్రాజెక్టు

- నేటి నుంచి కడపలో విద్యా, వైజ్ఞానిక సదస్సు

కరప: గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్నా తగిన ప్రోత్సాహం ఉంటే కొత్త ఆవిష్కరణలు చేయగలమని నిరూపించారు కరప మండలం గురజనాపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు. గురజనాపల్లి పబ్బినీడి పాపారావు జెడ్పీ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న పి.గంగాహారిక, ఎంఎస్‌వీఎస్ఎస్ జోష్ణవి.. గైడ్ టీచర్ వెలుగుబంట్ల వెంకటరమణమూర్తి, హెచ్ఎం ఎ.సాయిమోహన్ ఆధ్వర్యంలో రూపొందించిన ఉప్పు సాగులో సంక్షోభం, ఉప్పు రైతులకు ఆదాయాన్ని చేకూర్చే అనుసరణ వ్యూహాలు ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. ఈ ప్రదర్శన కడపలోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో ఈ నెల 28, 29 తేదీల్లో జరగనుంది. ఈ ప్రాజెక్టుకు మండల స్థాయిలో ప్రథమ, జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి లభించగా, రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు అర్హత సాధించింది.

బ్రిటిష్ కాలం నుంచి ఉప్పు తయారీలో ప్రసిద్ధి చెందిన గురజనాపల్లి నుంచి ఇతర రాష్ట్రాలకు సరకు ఎగుమతి చేసేవారు. ఉప్పు రైతులు ఎన్నో సమస్యలు ఎదుర్కోవడంతో నేడు అంతంతమాత్రంగానే తయారవుతోంది. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి ఉప్పును దిగుమతి చేసుకుని, ఇక్కడ అమ్మకాలు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, భౌతికశాస్త్రం టీచర్ రమణమూర్తితో ఆలోచించి ఉప్పు తయారీలో సమస్యలు, ఏం చేస్తే ఉప్పు రైతులకు లాభసాటిగా ఉంటుందో అన్న ప్రాజెక్టును రూపొందించాలని నిర్ణయించారు. నాలుగు నెలల పాటు గ్రామంలోని ఉప్పు రైతులను, కార్మికులను కలిసి సమాచారాన్ని సేకరించారు. కేంద్ర ఉప్పు శాఖ అధికారులతో విశ్లేషించారు. అన్నింటినీ క్రోడీకరించి ప్రాజెక్టును రూపొందించారు.

గుర్తించిన సమస్యలు

ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడం, రవాణా సమస్య, పెట్టుబడులు పెరగడం, నీటి కోసం డీజిల్ పంపుసెట్ల వినియోగం వంటి కారణాలతో క్రమంగా ఉప్పు సాగు తగ్గిపోయింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఉప్పు రైతులకు యూనిట్‌కు రూపాయి వంతున వసూలు చేసేవారు, తర్వాత టీడీపీ హయాంలో కమర్షియల్ చేశారు. 2013 నుంచి ఉప్పుసాగు లీజ్ పొడిగించకపోవడంతో 50 శాతం మేర సాగు విస్తీర్ణం తగ్గింది. ఆయా పరిస్థితులు కొనసాగితే 2027 నాటికి ఇక్కడ ఉప్పు తయారీ కనుమరుగు కావచ్చు. లాభసాటిగా ఉండాలంటే.. సోలార్ పంపుసెట్లను రాయితీపై ఇవ్వాలి. వర్షాకాలం నాలుగు నెలలు ఉప్పునీటిలో పెరిగే మిల్క్ ఫిష్ వల్ల ఆదాయం సమకూరుతుంది. ఉప్పు తయారీని వ్యవసాయ పరిశ్రమగా గుర్తించాలి.



జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో ఆర్‌జేడీ నాగమణి నుంచి ద్వితీయ బహుమతి తీసుకుంటున్న విద్యార్థినులు

సివిల్స్ సాధించాలని ఉంది



కష్టపడి చదువుకుని భవిష్యత్తులో సివిల్స్ సాధించాలన్నదే జీవితలక్ష్యం. చాలా గ్రామాల నుంచి వచ్చి ఉప్పు మావుల్లో పనిచేసేవారు. అది తగ్గడంతో.. ఉప్పురైతుల సమస్యలు, ఏం చేస్తే ప్రయోజనమో వివరించేందుకు ప్రాజెక్టును రూపొందించాం.

– ఎంఎస్‌వీఎస్ఎస్ జోష్ణవి, విద్యార్థిని, గురజనాపల్లి

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌నవుతా..



బాగా చదువుకుని భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవ్వాలన్నది జీవితాశయం. ఊరిలో ఉప్పుమళ్లు బీడుగా ఉండటం చూసి, స్నేహితురాలు జోష్ణవితో కల్సి నాలుగు నెలలు కష్టపడి ఈ ప్రాజెక్టు తయారుచేశాం. రాష్ట్ర ప్రదర్శనకు ఎంపికవ్వడం సంతోషంగా ఉంది.

– పి.గంగాహారిక, విద్యార్థిని గురజనాపల్లి

రాష్ట్ర ప్రదర్శనకు ఎంపికవ్వడం సంతోషంగా ఉంది



ఈ ప్రాజెక్టు రాష్ట్ర ప్రదర్శనకు ఎంపికవ్వడం చాలా సంతోషంగా ఉంది. స్కూల్లో జరిగిన పేరెంట్స్ మీటింగ్‌లో ఉప్పురైతులు వ్యక్తపరచిన ఆవేదనపై స్పందించి ఇద్దరు విద్యార్థులతో కష్టపడి ప్రాజెక్టును రూపొందించాం. ఉప్పు రైతులను, అధికారులను కలిశాం.

– వెలుగుబంట్ల వెంకటరమణమూర్తి, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు, గురజనాపల్లి హైస్కూలు

జిల్లా రెడ్‌క్రాస్ సేవలు నిరుపమానం



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: విభిన్న కార్యక్రమాలతో రెడ్‌క్రాస్ కాకినాడ జిల్లా శాఖ రాష్ట్రంలో అగ్రగామిగా పేరొందిందని కలెక్టర్, రెడ్‌క్రాస్ జిల్లా శాఖ అధ్యక్షురాలు కృతికా శుక్లా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో కాకినాడ సీ పోర్ట్సు లిమిటెడ్ రూ.20 లక్షల విలువైన అంబులెన్స్‌ను కలెక్టర్ కృతికా శుక్లా చేతుల మీదుగా ప్రారంభించారు. కేవలం ఏడాదిలోనే రెడ్‌క్రాస్ సేవలకు రాష్ట్ర స్థాయిలో రెండు బంగారు పతకాలను గవర్నర్ నుంచి అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు రెడ్‌క్రాస్ ద్వారా ప్రజలకు అందజేస్తామన్నారు. సంస్థ కోఆర్డినేటర్ ఎం మురళీధర్ అంబులెన్సు తాళాలను కలెక్టర్‌కు అందజేశారు. సీ పోర్ట్సు ప్రతినిధులను కలెక్టర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు, ప్రతినిధులు ఎన్ సుగుణ, ఎన్‌వీవీఆర్‌కే ప్రసాద్‌బాబు, కె.శివకుమార్, కేఎస్‌పీఎల్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియపై సమావేశం

కాకినాడ సిటీ: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జనవరి 12 వరకు ఓటర్ల సవరణ ప్రక్రియ జరుగుతుందని కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీఓ ఇట్ల కిషోర్ తెలిపారు. బుధవారం కాకినాడ ఆర్డీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష జరిపారు. జనవరి 17 నాటికి అభ్యంతరాలు పరిశీలించి, 22 నాటికి ఓటర్ల తుది జాబితా ప్రచురిస్తారని తెలిపారు. తహసీల్దార్లు మురార్జీ, శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్లు సురేష్, శ్రీనివాస్, మధు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అట్టహాసంగా జగనన్న సంక్రాంతి సంబరాలు

- పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి, ప్రజాప్రతినిధులు
- తొలిరోజు 1200 మంది మహిళల హాజరు



టగ్ ఆఫ్ వార్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: మహిళల కోసం ఏర్పాటు చేసిన జగనన్న సంక్రాంతి సంబరాలు జిల్లా కేంద్రం కాకినాడలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో తొలిరోజు దాదాపు 1,200 మంది మహిళలు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. కాకినాడను నాలుగు క్లస్టర్లుగా విభజించి ఒకొక్క క్లస్టర్ నుంచి రెండేసి డివిజన్లు చొప్పున తొలిరోజు 8 సచివాలయాల పరిధిలో పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్, టగ్‌ఆఫ్‌వార్ పోటీలకు విశేష స్పందన లభించింది. ఆయా ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి పోటీల్లో సందడి చేశారు. చక్కని రంగవల్లులు వేసి కొందరు, తాడును చేతపట్టి టగ్‌ఆఫ్‌వార్‌లో ఒకరికొకరు పోటీ పడుతూ, మ్యూజికల్ చైర్ పోటీల్లో సత్తా చాటేందుకు మరికొందరు ఉత్సాహాన్ని కనబరిచారు. నాలుగు డివిజన్లలో కలిసి తొలిరోజు సుమారు 1,200 మంది హాజరైనట్టు వైఎస్సార్ సీపీ నిర్వాహకులు ప్రకటించారు. ఒకటో క్లస్టర్‌కు సంబంధించి ఆరో డివిజన్‌లో ఎమ్మెల్యే సతీమణి ద్వారంపూడి మహాలక్ష్మి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, జేసీ కన్వీనర్ సుంకర విద్యాసాగర్ పర్యవేక్షించగా, రెండో క్లస్టర్‌కు సంబంధించి 20వ డివిజన్‌లో రాష్ట్ర రైసుమిల్లర్ల సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి దగ్గరుండి మహిళలను ఉత్సాహపరిచారు. మూడో క్లస్టర్‌కు సంబంధించి 33వ డివిజన్‌లో పార్టీ నేత రాగిరెడ్డి సుబ్బారావు, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, నాలుగో క్లస్టర్‌కు సంబంధించి 41వ డివిజన్‌లో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్ ఇనుకొండ పట్టాభిరామయ్య ఏర్పాట్లు పర్యవేక్షించారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆయా డివిజన్లలో జరిగిన జగనన్న సంక్రాంతి సంబరాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 10 వరకు రోజుకు నాలుగు డివిజన్లలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజు ఆయా పోటీల్లో గెలుపొందిన మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎంపిక చేసి, చివరి రోజు పంపిణీ చేస్తామన్నారు. ఆయా డివిజన్లలో సంక్రాంతి సంబరాలను పార్టీ నేతలు, కార్యకర్తలు, కన్వీనర్లు, గృహసారథులు పర్యవేక్షించారు.



సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి మహాలక్ష్మి, పార్టీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న

సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

- అధికారులతో కార్పొరేషన్ కమిషనర్ సమీక్ష

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ పింఛను కానుక పెంపుదలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు వచ్చే నెల మూడో తేదీన కాకినాడ విచ్చేస్తున్నందున అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో ఆర్వోలు, ప్రత్యేకాధికారులతో, నగరపాలక సంస్థ కార్యాలయంలోని వివిధ విభాగాధిపతులతో ఈ అంశంపై సమీక్షించారు. సామాజిక పింఛను పెంపు కార్యక్రమాన్ని స్థానిక రంగరాయ వైద్య కళాశాలలో సీఎం ప్రారంభిస్తారన్నారు. అలాగే ముత్తా గోపాలకృష్ణ వారధి, రాగిరెడ్డి కళాక్షేత్రం, స్కేటింగ్ రింక్‌లను కూడా సీఎం ఆ రోజు ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారన్నారు. సీఎం సభకు పింఛనుదారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు హాజరయ్యేలా ఆయా డివిజన్ల ప్రత్యేకాధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో నగరపాలక సంస్థ తరఫున చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆయా ప్రారంభోత్సవాలకు సంబంధించి పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో నగరపాలకసంస్థ ఎస్ఈ సత్యకుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, ఈఈలు మాధవీ, వెంకట్రావు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్, ఏఓ శిరీష్, ఇతర అధికారులు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నాగనరసింహారావు

జోరుగా ‘ఆడుదాం ఆంధ్రా’ పోటీలు

కరప: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు కరప మండలంలో రెండో రోజైన బుధవారం జోరుగా సాగాయి. కరప, అరట్లకట్ట, నడకుదురు, గురజనాపల్లి, వేములవాడ, వేళంగి, పెద్దాపురప్పాడు గ్రామాల్లోని జెడ్పీ హైస్కూళ్లలో క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ మ్యాచ్‌లు జరిగాయి. జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె.అప్పారావు ఆయా గ్రామాల్లోని ఆటల పోటీలను పరిశీలించారు. కరపలో జిల్లా స్పోర్ట్స్ అధికారి శ్రీనివాసరావు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. యువ క్రీడాకారులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను నిర్వహిస్తోందన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేలా క్రీడాకారులు ప్రతిభ చూపాలన్నారు. ఎంపీడీఓ అప్పారావు మాట్లాడుతూ రెండో రోజు 49 మ్యాచ్‌లు జరగ్గా, బ్యాడ్మింటన్–20, క్రికెట్–18, వాలీబాల్–11 మ్యాచ్‌లు జరిగాయన్నారు. ఆయా పాఠశాలల్లో పీడీలు ఆటల పోటీలను పర్యవేక్షిస్తున్నారు.



కరపలో వాలీబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్‌డీఓ, ఎంపీడీఓ

పెరిగిన ఓటరు దరఖాస్తుల పరిశీలన

- రాజకీయ పార్టీల నేతలతో ఏఈఆర్ఓ సమావేశం

కాకినాడ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ–2024లో భాగంగా ఫారం 6,7,8 ద్వారా ఇప్పటి వరకు కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలో 1,10,343 దరఖాస్తులు వచ్చాయని సిటీ నియోజకవర్గ ఏఈఆర్ఓ తహసీల్దార్ సీతాపతిరావు తెలిపారు. సవరణ ప్రక్రియ ప్రగతిపై స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఏఈఆర్ఓలు, పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సీతాపతిరావు మాట్లాడుతూ ఇతర నియోజకవర్గాలతో పోలిస్తే, కాకినాడ సిటీలో మూడు రెట్ల దరఖాస్తులు వచ్చాయన్నారు. బీఎల్వోలు, సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది సహకారంతో 97,971 దరఖాస్తులను పరిష్కరించామని చెప్పారు. 11,565 దరఖాస్తులను తిరస్కరించామన్నారు. సుమారు 767 దరఖాస్తులను ఇంకా పరిష్కరించాల్సి ఉందన్నారు. ఓటర్ల జాబితాలో సవరణల కోసం పెద్ద ఎత్తున దరఖాస్తులు వస్తున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం దరఖాస్తుల స్వీకరణకు గడువును ఈ నెల 12 వరకూ పొడిగించిందన్నారు.ఓటర్ల తుది జాబితాను జనవరి 22న ప్రచురిస్తారన్నారు. సమావేశంలో ఏఈఆర్వోలు మురళీకృష్ణ, జాన్‌బాబు, రావూరి వెంకటేశ్వరరావు (వైఎస్సార్ సీపీ), తుమ్మల రమేష్ (టీడీపీ), అప్పారావు (బీఎస్పీ) తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న సీతాపతిరావు

ఘనంగా పీఎంపీ వ్యవస్థాపక దినోత్సవం

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో పీఎంపీ వ్యవస్థాపక దినోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. గ్రామీణ ప్రాంతంలో పీఎంపీగా వైద్య సేవలందిస్తున్న కుమార్ యాదవ్‌ను ఘనంగా సత్కరించారు. అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్ మాట్లాడుతూ 1962 డిసెంబర్ 27న న్యూఢిల్లీలో డాక్టర్ ఆర్కే భరద్వాజ్ పీఎంపీల సంఘాన్ని స్థాపించారన్నారు.

టౌన్‌హాల్ సేవలు ప్రశంసనీయం

బోట్‌క్లబ్: సేవా కార్యక్రమాల నిర్వహణలో టౌన్‌హాల్ కమిటీ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక టౌన్‌హాల్‌లో బుధవారం పేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్య, వైద్య, క్రీడా విభాగాల్లో స్కాలర్‌షిప్‌ల రూపంలో విద్యార్థులను ఆదుకోవడం గొప్ప విషయమన్నారు. అనంతరం 350 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ద్వారంపూడిని కమిటీ సభ్యులు సత్కరించారు. కమిటీ అధ్యక్షుడు జి.సత్యనారాయణ మూర్తి, ప్రతినిధులు పాబోలు చినపున్నయ్య, రఘునాథ్, వీవీ సుబ్రహ్మణేశ్వరరావు, సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం

కాకినాడ సిటీ: సమగ్ర శిక్షా అభియాన్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, మినిమం టైం స్కేల్ అమలు చేయాలంటూ ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం 8వ రోజుకు చేరింది. ఆందోళనకారులు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాను కలిసి వినతి పత్రం అందజేశారు. జేఏసీ నాయకులు పీవీవీ మహాలక్ష్మి, జి నారాయణ, శ్రీనివాస్, ఎం గంగాధర్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలని వినతి

కాకినాడ రూరల్: తమ డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు బుధవారం రమణయ్యపేట వైద్యనగర్‌లో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు క్యాంపు కార్యాలయానికి తరలివచ్చారు. ఎమ్మెల్యే కన్నబాబు అందుబాటులో లేకపోవడంతో ఆయన తండ్రి సత్యనారాయణకు వినతిపత్రం అందించారు.

వ్యవసాయ క్షేత్రాల సందర్శన

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): జిల్లాలో ప్రకృతి వ్యవసాయం విధానాలపై అధ్యయనం చేసేందుకు ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఐదుగురు సభ్యుల బృందం కాకినాడ జిల్లాలో బుధవారం పర్యటించింది. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎలియజర్ ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎన్ విజయకుమార్‌ను ఆయన కార్యాలయంలో బృంద సభ్యులు కలుసుకున్నారు. జిల్లాలో వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ పరిస్థితులను తెలుసుకున్నారు. ఆర్‌బీకేల సేవలపై ఆరా తీశారు. ఈ బృందంలో అమిత్‌మిశ్రా, జూకర్ జ్యోషి, భాస్కర్‌సింగ్, సూర్యప్రతాప్, ఓం ప్రకాష్ ఉన్నారు.

జ్ఞానంతోనే శాంతి, సహనం

- సద్గురువు డాక్టరు ఉమర్ ఆలీషా

కాకినాడ రూరల్: మానవులు తమ జ్ఞానం ద్వారానే శాంతి, సహనాన్ని పొందగలరని పీఠాపురం విశ్వ విజ్ఞాన విద్యా, ఆధ్యాత్మిక పీఠం నవమ పీఠాధిపతి, సద్గురువు డాక్టర్ ఉమర్ ఆలీషా అనుగ్రహ భాషణ చేశారు. వాకలపూడి రామకృష్ణనగర్‌లోని విశ్వవిజ్ఞాన విద్యా, ఆధ్యాత్మిక పీఠం కాకినాడ శాఖ దశమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సద్గురువు పాదపూజను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. తొలుత సద్గురువు ఉమర్ ఆలీషాకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో సన్నాయి మేళం, కోటాటం, తప్పెటగుళ్లతో గుర్రపు బండిపై ఊరేగింపు ద్వారా ఆశ్రమానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పీఠం సభ్యులు ఆయనకు పాదపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని మతాల సారాంశం ఒక్కటేనని, తమ పీఠం ద్వారా ఈశ్వరత్వం బోధిస్తున్నామన్నారు. మానవ జన్మను ప్రతిఒక్కరూ సార్థకం చేసుకోవాలన్నారు. ఆధ్యాత్మిక చిత్తంతో జీవనం సాగిస్తూ, పరులకు సేవ చేయాలన్నారు. అవధాని ఉమామహేశ్వరరావు సద్గురువు విశిష్టతను సభకు వివరించగా, ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ మహిళలు, వలంటీర్లకు ధాన్యపు కురులు, 11 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఠాధిపతి సోదరులు అహ్మద్ ఆలీషా, పాషా, హుస్సేన్ షా, పీఠం కన్వీనరు పేరూరి సూరిబాబు, ఏపీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషాను గజమాలతో సత్కరించిన దృశ్యం

కాకినాడ వాసి వద్ద అరుదైన నాణెం

బోట్‌క్లబ్: శ్రీకృష్ణుడి భక్తురాలైన సంత్ మీరాబాయి 525 జయంతి సందర్భంగా కోల్‌కత టంకశాల రూ.525 విలువతో కూడిన స్మారక నాణేన్ని ముద్రించింది. కాకినాడకు చెందిన ప్రముఖ నాణేల సేకరణ కర్త మార్ని జానకిరామ్ చౌదరి దీనిని సేకరించారు. దీనిని ఇటీవల ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా శ్రీకృష్ణ జన్మభూమి మధురలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జానకిరామ్ చౌదరి మాట్లాడుతూ ఈ నాణెం 44 మి.మీ. చుట్టుకొలతతో, 35 గ్రాముల బరువు కలిగి, 50 శాతం వెండి, 40 శాతం రాగి, 5 శాతం నికెల్, 5 శాతం జింక్ లోహాల మిశ్రమంతో రూపొందించినట్టు వివరించారు. నాణేనికి ఒకవైపు వేలాది కీర్తనలు, భజనలు రచించి, గానం చేసిన సంత్ మీరాబాయి చిత్రం, మరోవైపు మన జాతీయ చిహ్నం అశోక స్తంభంపై ఉన్న మూడు సింహాలతో పాటు నాణెం విలువ రూ.525గా ముద్రించారు.



నాణేన్ని చూపుతున్న మార్ని జానకిరామ్

డ్రైవర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ: ఏపీఎస్‌ఆర్టీసీ నిర్వహణలోని పల్లెవెలుగు బస్సులకు రోజువారీ వేతనంపై పనిచేసేందుకు అర్హత కలిగిన డ్రైవర్లు తమను సంప్రదించాలని డిపో మేనేజర్ ఎంయువీ మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. హెవీ మోటారు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండి, 18 నెలల అనుభవంతో పాటు ఆర్టీఓ కార్యాలయం నుంచి ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

జిల్లా అధికారులకు అభినందనలు

కాకినాడ సిటీ: తమ విజ్ఞప్తి మేరకు జిల్లాలో రహదారులపై గుంతలు పూడ్చడంపై ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు బుధవారం జేసీ ఇలక్కియను కలిసి అభినందనలు తెలిపారు. సామర్లకోట–కాకినాడ ప్రధాన రహదారిలో గుంతలు పూడ్చాలని ఈ నెల 17న ఆందోళన చేసి, 18న స్పందనలో వినతిపత్రం ఇచ్చామన్నారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించి, ప్రస్తుతం కాకినాడ–సామర్లకోట ప్రధాన రోడ్డులో గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టినందుకు పార్టీ జిల్లా కన్వీనర్ నరాల శివ ఆధ్వర్యంలో నేతలు జేసీని కలిసి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కాళ్లూరి కృష్ణమోహన్, ముదునూరి అచ్యుతరామరాజు, రాజాపు శ్రీనివాసరాజు, ప్రభాకరరెడ్డి, రాపాక రాజాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా యంత్రాంగానికి అభినందనలు తెలుపుతున్న ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు